ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 27 జనవరి 2025 | 3



ఆంధ్రజ్యోతి
అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



3వ వార్డులో ధ్వంసమై అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

అమలాపురం 3వ వార్డులో

ప్రత్యేక కథనం 6లో

చుట్టూ సమస్యలే..

స్వచ్ఛమైన నీరు లేదు..రోడ్లు లేవు..డ్రైనేజీలు లేవు..

పాఠకుల చెంతకే 'ఆంధ్రజ్యోతి'

అక్షరంతో ఏం చేయగలం!?
సమాజంలో చైతన్యం తేగలం..
ప్రజాగళమై పోరాటం చేయగలం..
నేతలకు దిశానిర్దేశం చేయగలం..
సమస్యలను ఎత్తిచూపగలం.. పరిష్కరించగలం..
ఇప్పటివరకూ ఆ అక్షరమే ఆంధ్రజ్యోతి బలం..
తెల్లటికాగితంపై.. నల్లటి అక్షరాలతో
ఎన్నో అద్భుతాలు సృష్టించింది..
అక్షరమనే ఆయుధంతో ఎన్నో సాధించింది..
ఇప్పుడు మరో కొత్త అడుగు వేయబోతోంది..

మంగళవారం నుంచి పాఠకుల చెంతకే వస్తోంది.. సమస్యలపై గళమెత్తబోతోంది.. రాష్ట్ర సమస్యలే కాదండోయ్.. మీ వీధి.. మీ ఊరు.. మీ వార్డు.. మీ డివిజన్.. సమస్య ఏదయినా సరే.. ప్రజలకు.. ప్రజాప్రతినిధులు.. అధికారులకు మధ్య వారధిగా నిలిచి పరిష్కారంలో భాగం కానుంది.. తొలుత ఈ కార్యక్రమాన్ని మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం 3వ వార్డు.. కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డుల్లో శ్రీకారం చుడుతోంది.. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. మీ చెంతకు వచ్చిన ఆంధ్రజ్యోతి వద్దకు రండి.. మీకు తోడుంటాం.. మీ సమస్యలేమిటో చర్చిద్దాం..!



ప్రత్యేక జీపుపై నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పక్కన ఎస్పీ కృష్ణారావు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమం



పరిశీలన



ఎంపీ హరీష్ మాధుర్

జైహింద్

ఘనంగా గణతంత్ర వేడుకలు

- దేశ సమగ్రత, సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ మహేష్‌కుమార్
- జిల్లాలో ఘనంగా రిపబ్లిక్‌డే ఉత్సవాలు
- ముఖ్య అతిథులుగా ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు
- గౌరవ వందనం స్వీకరించిన కలెక్టర్, ఎస్పీలు

అమలాపురం, జనవరి 26:(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రత, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణతో పాటు కుల మత ప్రాంత భాషా భావాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ దేశాభివృద్ధికి పునరంకితం కావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశానికి పటిష్టమైన రాజ్యాంగం ఉండాలనే సంకల్పంతో నూతన రాజ్యాంగ రచనకు సన్నాహాలు ప్రారంభించి దేశ ప్రజల సంప్రదాయాలు, స్వేచ్ఛాహక్కులు, మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగం రూపకల్పన చేశారని, ఆ రాజ్యాంగం ద్వారా భారతదేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చిందన్నారు. కోనసీమ జిల్లా అభివృద్ధి, ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై రూపొందించిన పదమూడు పేజీల నివేదికను కలెక్టర్ మహేష్‌కుమార్ తన ప్రసంగం ద్వారా వివరించారు. జిల్లాకు సంబంధించి ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని తన ప్రసంగం ద్వారా శాఖల వారీగా కలెక్టర్ వివరించారు. 2024-25 సంవత్సరంలో 2.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.521 కోట్లు రైతుల ఖాతాల్లోకి 48 గంటల్లోనే జమ చేసిన ఘనత ప్రభుత్వానిదన్నారు. 'గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రూ.38 కోట్లతో 64.3 కిలో మీటర్ల మేర గుంతలు పూడ్చాం. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ప్రాజెక్టు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాం. చిర్రయానం పసుపు పీతల హేచరీ ఏర్పాటుకు ఐదు ఎకరాల భూమి కేటాయించాం. కోనసీమలో పర్యాటక రంగం అభివృద్ధి చేసేందుకు గోదావరి, సముద్ర తీర ప్రాంతాలను ఎంపిక చేసి చర్యలు చేపట్టాం. 13 ఇసుక రీచ్‌ల ద్వారా ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నాం. రూ.55 లక్షలతో అమలాపురం పట్టణంలో అన్న క్యాంటీను ఏర్పాటు పూర్తి చేస్తున్నాం. 8 వేల మంది హాస్టల్ విద్యార్థులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఐసీఐసీ లాంబార్డు సంస్థతో ఒప్పందం చేసుకున్నాం. పిల్లల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కోనసీమ క్రీడోత్సవాన్ని నిర్వహించాం' అని కలెక్టర్ వివరించారు. జిల్లాలో 994 టెరిటోరియల్ నియోజకవర్గాలు, 83 నీటి వినియోగదారుల సంఘాలు, 15 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీకి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు. పీఎం కిసాన్ రెండో విడతలో లక్షా 24 వేల మంది రైతులకు రూ.49 కోట్లు విడుదల చేశాం. 2.62 లక్షల ఎకరాల్లో పంటలు, ఉద్యాన పంటలు నమోదు చేశాం. గత ఏడాది సంభవించిన వరదలకు నష్టపోయిన 1073 మంది రైతులకు రూ.1.37 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించాం. జిల్లాలో ఇప్పటి వరకు 251 మంది పాడి రైతులకు 1.25 కోట్లు రుణాలు అందించాం. 90 శాతం సబ్సిడీపై రూ.18.29 కోట్ల విలువ కలిగిన 879 గోకులం షెడ్లు మంజూరు చేశాం. జిల్లాలో 16,408 మత్స్యకార కుటుంబాలకు రూ.557 కోట్ల ఓఎన్జీసీ పరిహారాన్ని పంపిణీ చేశాం. ఉచిత గ్యాస్ పథకం కింద 3.36 లక్షల మంది వినియోగదారులకు రూ.27 కోట్లు రాయితీ సొమ్ములు అందజేస్తున్నాం. 5.23 లక్షల కార్డుదారులకు 8320 మెట్రిక్ టన్నుల బియ్యం, 286 మెట్రిక్ టన్నుల పంచదార, 547 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేశాం. రూ.26.93 కోట్లతో 243 జలవనరుల శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టాం. రూ.44 కోట్లతో 24 వేల శస్త్రచికిత్సలు చేశాం' అని కలెక్టర్ చెప్పారు. 58.43 కోట్లతో ఉపాధి హామీ పనులు ద్వారా వివిధ కార్యక్రమాలు చేపట్టాం. వీటిలో 771 పనులు చేపట్టగా 561 పనులు పూర్తి అయ్యాయి. జల జీవన్ మిషన్ పథకం ద్వారా 3లక్షల 3వేల ఇళ్లకు కుళాయిలు ఏర్పాటుచేశాం. డ్వాక్రా సంఘాల మహిళలకు తక్కువ వడ్డీకి రూ.9002 కోట్లు రుణాలుగా ఇవ్వడం, ప్రతీ నెల రూ.100 కోట్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని జిల్లాలో వివిధ ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను కలెక్టర్ తన సుదీర్ఘ ప్రసంగంలో వివరించారు. తొలుత జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అదే విధంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు ఎస్పీ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పతాకావిష్కరణ చేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి శకటానికి ఫస్ట్

గణతంత్ర వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ శకటం ప్రథమస్థానం సాధించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థకు ద్వితీయ బహుమతి, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఉద్యానశాఖ సంయుక్త శకటానికి తృతీయ స్థానం లభించింది. వ్యాస రచన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

డాగ్ స్క్వాడ్ విన్యాసాలు అదుర్స్

వేడుకల్లో భాగంగా డాగ్‌స్క్వాడ్‌లోని శాండీ, స్పైడర్ చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శిక్షణ పొందిన శాండీ కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి గౌరవ వందనం చేసింది. ఇక డాగ్ స్పైడర్ చేసిన విన్యాసాలు గగుర్పాటును కలిగించాయి. డాగ్ స్పైడర్‌కు విన్యాసాలకు ప్రత్యేక బహుమతిని కలెక్టర్ అందజేశారు.

ఆకట్టుకున్న శకటాలు



దేవదాయశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన శకటం



చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన శకటం



జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శకటం



అన్న క్యాంటీన్ శకటం



సాంస్కృతిక కార్యక్రమం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాండీ



సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు

అధికారులకు అవార్డులు



అమలాపురం ఆర్డీవో మాధవికి పురస్కారం అందిస్తున్న కలెక్టర్



రామచంద్రపురం ఆర్డీవో అఖిల



కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్



కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీ



డ్వామా పీడీ ఎస్.మధుసూదన్



డీఈవో షేక్ సలీంబాషా



డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్



స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సురేష్‌కుమార్



పంచాయతీరాజ్ డీఈ రాజ్‌కుమార్



డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ



డివిజనల్ పీఆర్వో రామిరెడ్డి



డీఎంహెచ్‌వో దుర్గారావుదొర



జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం

అధికారులకు ప్రశంసా పత్రాలు

గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లాస్థాయిలో 305 మంది ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రశంసా పత్రాలను అందజేశారు. వారిలో జిల్లాస్థాయి అధికారులు 16 మంది ఉన్నారు. జిల్లా స్థాయిలో అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి పి.రామకృష్ణారెడ్డి, సివిల్‌సప్లయి అధికారి ఎ.ఉదయభాస్కర్, సివిల్ సప్లయి మేనేజర్ ఎం.బాలసరస్వతి, జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, ఐఅండ్‌పీఆర్ జిల్లా అధికారి కె.లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా వైద్య సేవల సమన్వయకర్త డాక్టర్ కె.కార్తీక్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా స్పోర్ట్స్ డెవలెప్‌మెంట్ అధికారి పీఎస్ సురేష్‌కుమార్, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ అధికారి ఎస్.మురళీకృష్ణ, డివిజనల్ డెవలెప్‌మెంట్ అధికారి ఎస్.త్రినాథరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి ఎస్కేడీవీ ప్రసాద్, జిల్లా ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారి బి.రాము తదితరులు ఉన్నారు.

'సైకిల్' వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

అమలాపురంలో బ్లైండ్ ఫోల్డ్ సైకిల్ ర్యాలీ



బ్లైండ్ ఫోల్డ్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి సైకిల్ వ్యాయామం దోహదపడుతుందని సీఐ పి.వీరబాబు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం శ్రీ వాగ్దేవి స్కూలు, పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో వినూత్న రీతిలో ఆదివారం బ్లైండ్ ఫోల్డ్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రావులపాలానికి చెందిన శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ అధినేత, యువ ఇంద్రజాలకుడు డాక్టర్ చింతా మోహిత్, డాక్టర్ సీత ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పట్టణ వీధుల్లో నిర్వహించిన ర్యాలీని డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శిష్టా శ్రీరామచంద్రమూర్తి, హెచ్‌ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం పారంభించారు. గడియార స్తంభం సెంటర్‌లో పట్టణ సీఐ పి.వీరబాబు మాట్లాడుతూ సైకిల్ వ్యాయామం విశిష్టతను వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా నియమాలు పాటించాలని విద్యార్థులకు వివరించారు. పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు, చింతా శ్యామ్ జాదూగర్ తదితరులు పాల్గొన్నారు.



సోలార్ కెమెరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

'అంతర్వేది'పై నిఘా నేత్రం

అంతర్వేది, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది బీచ్ వద్ద నుంచి సాగర సంగమం వరకు మెరైన్ పోలీసుల సహకారంతో శాశ్వత సోలార్ సిస్టమ్ సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. స్థానిక ఎంపీటీసీ భైరా నాగరాజు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ స్థానిక నాయకులతో కలిసి అమర్చిన సీసీ కెమెరాలను ఆదివారం పరిశీలించారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే బీచ్, లైట్‌హౌస్ రోడ్డు కవర్ చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మాఘమాసంలో జరిగే తీర్థ మహోత్సవాలకు, రాబోయే రోజుల్లో భక్తుల తాడికి ఎక్కువగా ఉన్నందున సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం అభినందనీయమని నాయకులు అన్నారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భరత జాతి గొప్పదనాన్ని వివరిస్తూ విద్యార్థినుల నృత్య రూపకం



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆసనంతో ఆకట్టుకున్న విద్యార్థిని

దేశభక్తి... వెల్లువెత్తి...



కాకినాడలో భరతమాత వేషధారణలో పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థిని



గణతంత్ర వేళ... సాంస్కృతిక హేల

కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం సిటీ/అమలాపురం టౌన్: గణతంత్ర సంబరాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు అంబరాన్నంటాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 76వ గణతంత్ర దినోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేశభక్తిని చాటేలా విద్యార్థులు, చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. నృత్యాలు, స్కిట్స్‌లను చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహుతులు మంత్రముగ్ధులయ్యారు.



మేరా భారత్ మహాన్
(కాకినాడలో జాతీయ జెండాతో చిన్నారి)



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఆకట్టుకున్న కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులు



76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేట శ్రీప్రజ్ఞ స్కూలు విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. జాతీయ పతాకావిష్కరణ అనంతరం మెయిన్‌రోడ్డులో దేశభక్తి గీతాలతో శోభాయాత్ర నిర్వహించారు.

సర్టిఫికెట్‌కు ఓ రేటు ..!

» సూరంపాలెం వీఆర్వో నిర్వాకం » కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితురాలు

గండేపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెం వీఆర్వో ప్రతి సర్టిఫికెట్‌కు ఓ రేటు నిర్ణయించినట్టు తెలిసింది. సదరు ఉద్యోగికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సైతం వత్తాసు పలుకుతున్నారంటూ ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలివి... సూరంపాలెంకు చెందిన అడ్డాల అనంతలక్ష్మికి ఐదుగురు సంతానం కాగా, వీరిలో ముగ్గురికి జనన నమోదు సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా... పట్టించుకోకపోవడంతో ఆమె కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస రావును ఆశ్రయించింది. ఆయన సహకారంతో కలెక్టర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ పెద్దాపురం ఆర్డీవో, గండేపల్లి తాసిల్దార్‌కు ఆదేశాలు జారీ చేయడంతో అసలు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక్కొక్క పత్రానికి ఐదు వేల రూపాయలు చొప్పున్న డిమాండ్ చేసినట్టు సమాచారం. అయితే ఇదే గ్రామంలోని సుమారు 40 నుంచి 50 మంది విద్యార్థులు జనన సర్టిఫికెట్ల కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, వెంటనే జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై వీఆర్వో స్పందిస్తూ వాళ్లని లంచం అడగలేదని, సర్టిఫికెట్ ఎంక్వైరీ ఆలస్యం అవ్వడం వల్లే ఫిర్యాదు ఇచ్చారన్నారు.

న్యాయనిర్ణేతలుగా ఇద్దరు క్రీడాకారుల ఎంపిక



అడపా శ్రీనివాస్, గొలకోటి శ్రీనివాస్

అమలాపురం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించే బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా అమలాపురం రూరల్ మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు వారికి ఉత్తర్వులు అందాయి. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే నేషనల్ గేమ్స్‌లో బ్యాడ్మింటన్ పోటీలకు ఈదరపల్లి అలవైకుంఠపురం కాలనీకి చెందిన అడపా శ్రీనివాస్, కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గొలకోటి శ్రీనివాస్‌ను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ఎంపైర్లుగా నియమించింది. గతంలో వీరిద్దరు పలు జాతీయ టోర్నమెంట్లకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వీరిని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంకమ్మచౌదరి ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాలు, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, హెచ్‌ఎం వీ.చక్రధరరావు అభినందించారు.

పాపికొండల్లో జన సందడి

» పది పర్యాటక బోట్లు ఏర్పాటు



పాపికొండలు విహార యాత్రకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు ఆదివారం పెద్దసంఖ్యలో విచ్చేశారు. పది బోట్లలో సుమారు 466 మంది అందాలను తిలకించారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ తల్లిని దర్శించుకుని గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మంటూరు, కొండమొదలు, తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లికి వెళ్లారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన మాతృ శ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.

దర్శన టిక్కెట్లు, తదితర వాటి ద్వారా రూ.16,600 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తి అవసరం

» సంవిధాన్ ర్యాలీలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు



బీజేపీ సంవిధాన్ అభియాన్ ర్యాలీలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల , నల్లమిల్లి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. కోటిపల్లి బస్టాండు సెంటర్లోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కు నుంచి గోదావరి గట్టు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు హాలు వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎంపీతోపాటు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన సభలో పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగానికి అనేక సవరణలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. రాజ్యాంగానికి 41వ సవరణ చేస్తూ సెక్యులర్ అనే పదాన్ని పీఠికలో పొందుపర్చారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మనకు దిక్సూచి వంటిదన్నారు. సభలో బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, బొమ్ముల దత్తు, వీరా వీరాంజనేయులు, హారిక, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎంపీ పురంధేశ్వరి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులోని 12 మంది మహిళా స్వాతంత్ర్యయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు వెంకట రామారావు

పెద్దాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంచంద్రమాంపల్లి (దివిలి)లో స్నేహఆర్ట్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో చివరి రోజు ముఖ్య అతిథిగా ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మానందం, కొత్తిం స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అమరావతి ఆర్ట్స్ (గుంటూరు) ఆధ్వర్యంలో ప్రదర్శించిన చిగురు మేఘం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచన చేయగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. మిత్రా క్రియేషన్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇది రహదారి కాదు నాటిక అలరించింది. ఈ నాటికను ఆకురాతి భాస్కరచంద్ర రచించగా ఎంఎం బాషా దర్శకత్వం వహించారు. స్నేహఆర్ట్స్ (చంద్రమాంపల్లి) ప్రదర్శించిన 'చచ్చిన నాటిక' ఆకట్టుకుంది. నాటికకు రచన బర్రే సత్యనారా యణ చేయగా ఎం.సుబ్బు దర్శకత్వం వహించారు.

వాఘా సరిహద్దులో మోతుగూడెం యూత్



వాఘా బోర్డర్‌లో జాతీయ జెండాతో మోతుగూడెం యువకులు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం యువకులు ఇండియా-పాకిస్తాన్ సరిహద్దు వాఘాలో రిపబ్లిక్ డే వేడుకలు జరుపుకున్నారు. యూత్ సభ్యులు ఎండీ జాకీర్, సందీప్, పలుకూరి రామరాజు, చింతా వినోద్, పరిమళ హేమంత్ జాతీయ జెండాను ఎగురవేసి భారతీయులుగా గర్వపడుతున్నామని చెప్పారు. ఈ సంఘటన తమ జీవితంలో అత్యంత విలువైనదని పేర్కొన్నారు.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

చెట్టుకు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం పాత బొమ్మూరుకి చెందిన మర్రి రాజారత్నకుమార్ (23) అనే యువకుడు తన ఇంటికి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన మద్యానికి బానిసై ఇంట్లో గొడవలు పడి రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కానీ అతని తల్లిదండ్రులు కాపాడుకున్నారు. ఈ క్రమంలో విజయవాడలో ఉంటున్న పెద్ద కుమారుడు ఇంటికి శనివారం తల్లిదండ్రులు వెళ్లారు. దీంతో మానసిక సమస్యలతో బాధపడుతున్న రాజారత్నకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై .. ట్రాలీ లారీ బోల్తా

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



ట్రాఫిక్‌ను క్రమబద్దీకరిస్తున్న పోలీసులు

దివాన్‌చెరువు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి దివాన్‌చెరువు సమీపంలో ఆదివారం ఇనుప ఊచల లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎస్‌ఐ ఎస్.పి కుమార్ వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్ మహ్మద్ ఆదిల్‌ను బయటకు తీశారు.

అతిపెద్ద పర్వతాన్ని.. అధిరోహించిన ఆచంట ఉమేష్



మౌంట్ కోజిస్కో పర్వతంపై జెండాతో ఉమేష్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పర్వతారోహకుడు ఆచంట ఉమేష్ ఆస్ట్రేలియా ఖండంలోనే అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించాడు. రిపబ్లిక్ డే సందర్భంగా మౌంట్‌కోజిస్కోను అధిరోహించి జాతీయ జెండాను ప్రదర్శించాడు. ఈ పర్వతం ప్రపంచంలో ఏడు ఖండాల్లో అతి పెద్దది. దీనిఎత్తు 2228 మీటర్లు, ఉమేష్ స్పెషల్ పర్మిషన్ తీసుకుని గైడ్ లేకుండా సొంతంగా వెళ్లాడు.



భారీ ట్రాలీ

84 టైర్లతో జాతీయ రహదారిపై ఒడిశా వైపు పయనం

పిఠాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216పై ట్యాంకర్‌ను తీసుకెళ్తున్న భారీ ట్రాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాకినాడ నుంచి ఒడిశా వెళ్తున్న ఈ ట్రాలీకి 84 టైర్లు ఉన్నాయి. తిమ్మాపురం వద్దకు శనివారం చేరిన ఈ ట్రాలీ పిఠాపురం బైపాస్ రోడ్డుకు ఆదివారం చేరుకుంది. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య టోల్‌గేట్ దాటే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. టోల్‌గేటు దాటిన తర్వాత సాయంత్రం వరకు ట్రాలీని అక్కడే నిలిపి ఉంచగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



విరవాడలో 250 అడుగుల జాతీయ జెండా

పిఠాపురం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 250 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. పతాకంతో గ్రామ వీధుల్లో ర్యాలీ జరిపారు.



వాలీబాల్ టోర్నమెంటు లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఫిబ్రవరి 26 నుంచి గొల్లవిల్లిలో ఏఎస్ఆర్ నేషనల్ వాలీబాల్ టోర్నమెంటు

ఉప్పలగుప్తం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ ఇన్విటేషన్ వాలీబాల్ పోటీల లోగోను గొల్లవిల్లిలోని అరిగెల వెంకటనరసింహారావు గృహ ప్రాంగణంలో టోర్నమెంటు గౌరవాధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం ఆవిష్కరించారు. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగినమీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1988 నుంచి వాలీబాల్ జాతీయ పోటీలు నిర్వహిస్తూ గొల్లవిల్లి ప్రత్యేక గుర్తింపు పొందిందని వివరించారు. త్వరలో జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. గొల్లవిల్లి టోర్నమెంటుకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. టోర్నమెంటు అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు టోర్నమెంటు జరుగుతుందన్నారు. వాలీబాల్ నేషనల్ ఫెడరేషన్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. ఫ్లడ్ లైట్ వెలుగుల్లో డే అండ్ నైట్ పోటీలు నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, టోర్నమెంటు ముఖ్య సలహాదారు అరిగెలనానాజీ, సాంకేతిక సలహాదారు వుంద్రు రాజబాబు, ఉపాధ్యక్షులు మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, కోశాధికారి గనిశెట్టి తాతాజీ, సంయుక్త కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, గుత్తాల సుభాష్‌చంద్రరావు, కార్యవర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇది మాకు గ్రాండ్ సంక్రాంతి

'సంక్రాంతికి వస్తున్నాం' విజయ యాత్రలో హీరో వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతికి వస్తున్నాం' మాకు గ్రాండ్ సంక్రాంతి అయ్యిందని ఆ చిత్ర హీరో విక్టరీ వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తం చేశారు. విజయ యాత్రలో భాగంగా ఈ చిత్రం ప్రదర్శితమవుతున్న శ్యామల థియేటర్‌కి హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ మీనాక్షి చౌదరి, నటుడు శ్రీనివాసరెడ్డి, నిర్మాత శిరీష్ ఆదివారం మార్నింగ్ షో సమయంలో విచ్చేశారు. వారికి మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధులు ఉదయరాజు, సత్తిరెడ్డి డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి పుష్పమాలలతో సత్కరించారు. చిత్ర యూనిట్ సభ్యులను థియేటర్లోకి తీసుకెళ్లి ప్రేక్షకులను పరిచయం చేశారు. ప్రేక్షకులకు అభివాదం చేస్తూ పలకరిస్తూ సినిమా గురించి స్పందన తెలుసుకున్నారు. సినిమాను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం థియేటర్ ఆవరణలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హీరో వెంకటేష్ మాట్లాడుతూ ప్రేక్షకులంతా ఈ సినిమాను బాగా ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. గోదావరి యాసతో మాట్లాడడం సినిమాకు బాగా కలిసివచ్చిందన్నారు. గోదావరి జిల్లాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ తమ కాంబినేషన్లో ఎఫ్2 నుంచి చూస్తే ఇది మూడవ సినిమా అని.... 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు పెద్ద హిట్ ఇచ్చారన్నారు. బుల్లిరాజు పాత్ర డైలాగ్స్‌లో ఎలాంటి కాంట్రవర్సీ లేదన్నారు.ఆ డైలాగ్స్ కోసమే ప్రేక్షకులు సినిమాను ఐదారుసార్లు చూసి బాగా ఎంజాయ్ చేస్తున్నారన్నారు. నిర్మాత శిరీష్ మాట్లాడుతూ ఈ సినిమాకు అన్నిచోట్లా మంచి టాక్ ఉందని, ముఖ్యంగా తూర్పు గోదావరిలో అద్భుత స్పందన ఉందని, ఇక్కడ వసూళ్లు రూ.10 కోట్లు దాటాయన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ఈ సినిమా తనకు పెద్ద హిట్ ఇచ్చిందన్నారు. అనంతరం వెంకటేష్, రానా అభిమానులు కోరుమిల్లి రాజశేఖర్, జాన హనుమంతరావు నేతృత్వంలో అభిమానులతో కలిసి హీరో వెంకటేష్ కేక్ కట్ చేశారు.



శ్యామల థియేటర్లో ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న హీరో, డైరెక్టర్



55 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఎన్నేళ్లో వేచిన ఉదయం

పెద్దాపురం వీర్రాజు హైస్కూల్లో ఏడు పదుల వయసులో విద్యార్థుల కలయిక

పెద్దాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏరా ఎలా ఉన్నావు.... ఏమి చేస్తున్నావు... ఎక్కడ ఉంటు న్నావు.... ఇలా ఒకరికొకరు ఆప్యాయం గా పలకరించుకుంటూ ఏడు పదుల వయసులో ఉన్నవారంతా సందడి చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని వీర్రాజు హైస్కూల్లో 1969-70 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పుడు చేసిన చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఏడు దశాబ్దాల తర్వాత కలవడంతో ఉద్విగ్నభరిత వాతావరణంలో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరవశించిపోయారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన కంభంపాటి గౌరీపతి శాస్త్రి, డ్రిల్ మాస్టర్ స్టీవెన్‌సన్‌లను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముప్పన శ్యామలాంబ, వీర్రాజు, యెంద్రు రామారావు, ముత్యాల రాజబ్బాయి, చల్లా విశ్వనాథం, దుర్గా మోహన్‌రావు, జెట్టి రాజబ్బాయి, మలిరెడ్డి సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాటి గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పెట్రోల్ కొట్టించుకుని .. స్కాన్ చేస్తుండగా

- మోటార్ సైకిల్‌తో ఆగంతకుడు పరార్
- చేబ్రోలు పెట్రోల్ బంకులో నాటకీయ పరిణామం



చేబ్రోలు పెట్రోల్ బంకు నుంచి పరారవుతున్న వ్యక్తి(సీసీ కెమెరాల్లో)

గొల్లప్రోలురూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ కొట్టించుకొని డబ్బులు చెల్లించేందుకు ఫోన్‌తో స్కాన్ చేస్తుండగా ఓ ఆగంతకుడు మోటార్‌సైకిల్‌తో పరారయ్యాడు. ఈ నాటకీయ పరిణామం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు హెచ్‌పీ పెట్రోల్ బంకులో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని తాటిపర్తికి చెందిన గారపాటి వెంకట్రాజు తన మోటార్‌సైకిల్‌తో చేబ్రోలు శివారులో 216వ జాతీయరహదారిలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకునేందుకు మధ్యాహ్నం 11.52 గంటల సమయంలో వెళ్లాడు. పెట్రోల్ కొట్టించుకుని డబ్బు లు చెల్లించేందుకు మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి స్కానర్ వద్దకు వెళ్లాడు. ఇంతలో నిక్కరు వేసుకుని షర్ట్ లేకుండా పిచ్చివాడిగా తిరుగుతున్న వ్యక్తి ఆ మోటార్‌సైకిల్‌ను తీసుకుని పరారాయ్యాడు. ఈ మేరకు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటార్‌సైకిల్ తీసుకుని పరారవుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కాగా మోటార్‌సైకిల్ చోరీ చేసిన వ్యక్తి ఆదివారం రాత్రి విశాఖ-శ్రీకాకుళం రోడ్డులో ఎడ్ల బండిని ఢీకొట్టినట్టు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుల్లో ... ఒకరి మృతి

ముమ్మిడివరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ నలుగురు యువకుల్లో ఒకరు ఆదివారం మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం యలకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్, ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజు మోటారు సైకిల్‌పై శనివారం అమలాపురం నుంచి ముమ్మిడివరం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో మలికిపురానికి చెందిన నల్లి వంశీ, గెద్దాడ మణికంఠ మోటారు సైకిల్‌పై కాకినాడ నుంచి మలికిపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై.జంక్షన్‌లో వారి వాహనాలు ఢీకొన్నాయి. దీంతో క్షతగాత్రులను అమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే వడ్డి సిరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీతానగరం వెల్ఫేర్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి



సీతానగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సీతానగరం సచివాలయం -2లో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోన పవన్‌కుమార్ (30) ఆదివారం తెల్లవారు జామున ఆకస్మికంగా మృతిచెందాడు. సుమారు నాలుగు గంటల ప్రాంతంలో కడుపునొప్పి రావడంతో వాంతులు చేసుకొని ప్రాణం విడిచినట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు. కోరుకొండ మండలం జంబూపట్నంకి చెందిన పవన్ .. తండ్రి మరణాంతరం ఉద్యోగంలో చేరాడు. ఆయన మృతికి పంచాయతీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, సిబ్బంది సంతాపం వ్యక్తపరిచారు.

'రియల్' మోసం

- జనాల సొమ్ము రూ.నాలుగు కోట్లు వసూలు చేసి వ్యక్తి ఉడాయింపు
- మోసపోయాం.. న్యాయం చేయాలంటూ బాధితుల వేడుకోలు
- మాచవరంలో వ్యాపారి ఇంటి ఎదుట ధర్నా



వెంకటరెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

రాయవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానంటూ ప్రజలను నమ్మబలికి రూ. నాలుగు కోట్లతో ఓ మోసగాడు ఉడాయించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరంలో ఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరం పల్లపువీధి రామాలయం సమీపంలో కర్రి వెంటరెడ్డి అలియాస్ దత్తుడు అలియాస్ దొరబాబు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ప్రజలతో నమ్మకంగా మెలిగిన సదరు వెంకటరెడ్డి తనకు కాకినాడలో డీమార్ట్ సమీపంలో భూములు ఉన్నాయని, కాకినాడ మున్సిపాలిటీలో ఒక ఉద్యోగి ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నానని, పెట్రోల్ బంక్, తదితర వ్యాపారాలు ఉన్నాయంటూ నమ్మబలికాడు. దీంతో మాచవరం, అనపర్తి మండలం పులుగుర్త గ్రామాలకు చెందిన సుమారు 45 మంది రైతులు, తదితర వారి వద్ద నుంచి సొంత అవసరాలు, కుమార్తె పెళ్లి ఖర్చుల నిమిత్తం నగదు రూ. నాలుగు కోట్లు అప్పుగా తీసుకున్నాడు. అప్పులు ఇచ్చిన వ్యక్తులకు వెంకటరెడ్డి మూడు నెలలుగా తిరిగి సొమ్ములు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చింది. దీంతో గ్రామపెద్దల్లో పెట్టి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వారంతా వాపోయారు. ఈ క్రమంలో ఆదివారం వెంకటర్‌రెడ్డి ఇంటి ఎదుట బాధితులంతా ధర్నాకు దిగారు. తమ పిల్లల చదువు, పెళ్లిళ్ల నిమిత్తం దాచుకున్న సొమ్ములను ఇప్పించాలని వేడుకుంటున్నారు. ఈ సంఘటనపై రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పూజా కార్యక్రమంలో భక్తులు

లోవకు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ. 3.12 లక్షల ఆదాయం

తుని రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమల్లో కొలువై ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు వేలాదిగా పోటెత్తారు.తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి జనం రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనం అనంతరం కుటుంబ సమేతంగా ఆదివారం ఒక్కరోజే వివిధ విభాగాలద్వారా రూ. 3.12 లక్షల ఆదాయం సమకూరినట్టు ఉప కమిషనర్, ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు తెలిపారు.

వేడుకగా సత్యదేవుడి ఆర్జిత రథసేవ



రథోత్సవంలో సహాయ కమిషనర్ రామ్మోహనరావు

అన్నవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడు సత్యదేవుడి వారాంతపు ఆర్జిత రథసేవను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను టేకు రథంపైకి తెచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి భీమవరానికి చెందిన భక్తుడు జీ.సోమవెంకట కార్తీక్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన్ని అభినందించి, స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాన్ని బహూకరించారు.

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో

ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



పతాకానికి వందనం సమర్పిస్తున్న బీఎం శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్, సిబ్బంది

దివాన్‌చెరువు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగ విశిష్టతను ప్రతిఒక్కరూ గౌరవించాలని, అది మనందరి కర్తవ్యమని ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాజానగరం మండలం దివాన్‌చెరువులోని యూనిట్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజున ఈ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎడిషన్ ఇన్‌ఛార్జి బీహెచ్‌వీ మంగేష్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల వల్లే నేడు మనం స్వేచ్ఛా జీవితాన్ని అనుభవిస్తున్నామన్నారు. జిల్లా స్టాఫర్ ఎస్.ఎస్.ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ అందరికీ విద్య అవసరమని, దీనితోనే జీవితంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ మేనేజర్ బీ. గోపాలకృష్ణ, ఏబీఎన్ రిపోర్టర్ కే.రాజాబాబు, సబ్‌ఎడిటర్లు వీజీ మహేశ్వరరావు, జీ.శేషగిరిరావు, ఎస్.రవికుమార్, సిస్టమ్ ఇన్‌ఛార్జి ఎన్.శివకుమార్, రిపోర్టర్ కాదంబరి శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్ ఎస్.రాంబాబు, ఏబీఎన్ కెమెరామెన్ సతీష్, యాడ్స్ విభాగం నుంచి ఎం.రవీంద్ర, బీవీ సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది జి.వీరభద్రరాజు, శివ, కిరణ్, సంతోష్, టి.శ్రీనివాస్, డీ.మహేష్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కే. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 126 కిలోల గంజాయి పట్టివేత



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మోతుగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో 126 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ఎస్‌ఐకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేస్తుండగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేశారు. వీరంతా తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాలోని కొత్తపల్లికి చెందిన మేరుగు సాదయ్య, పైడి చింతలపల్లికి చెందిన రంగు రమేష్, గుర్రం సురేష్, మల్లాపురానికి చెందిన వడ్ల రాజీర్, జగిత్యాల జిల్లా మల్లాపురానికి చెందిన గుడ్ల చంద్రశేఖర్, హనుమాన్‌వాడ భోగా అనిల్‌కుమార్. రెండు కారుల్లో వచ్చారు. గంజాయి విలువ రూ.6.30 లక్షలు ఉంటుందని పోలీసులు చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఐ కే. శివనారాయణ, ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, హెచ్‌సీఎస్ పురుషోత్తం, కొండబాబు, పీసీ సన్యాసిరావు, ఏఆర్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



రాయవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం పసలపూడి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న తాతపూడి అబ్బాయి (57) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వీఆర్వో కుమారుడు తులసీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా అబ్బాయి అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబీకులు చెప్పారు. ఈయనకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు తులసీధర్ వెదురుపాక గ్రామ వ్యవసాయ సహాయకుడిగా పని చేస్తున్నారు. అబ్బాయి అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఆలమూరు మండలం నవాబుపేటలో నిర్వహించారు. వీఆర్వో మృతిపట్ల తహశీల్దారు ఐపీ శెట్టి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది , తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అమలాపురం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

అమలాపురం పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో అపార్టుమెంట్లు, భారీ భవంతులు నిర్మాణాలు ఓ పక్క.. సమస్యలతో సతమతమవుతున్న ప్రాంతాలు మరో పక్క..పట్టణం విస్తరిస్తున్నట్టే పట్టణంలో పలు ప్రాంతాల్లో సమస్యలు కూడా విస్తరిస్తున్నాయి. మంచినీటి సదుపాయం, ప్రధానమైన రోడ్లు, విద్యుద్దీపాలు,డ్రెన్ల నిర్మాణం వంటివి కూడా ఏళ్ల తరబడి జరగకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇలాంటి సమస్యలకు కేంద్ర బిందువుగా అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 3వ వార్డు ఉంది. గత కొన్నేళ్ల నుంచి ఇక్కడ సమస్యలు తిష్ట వేశాయి. ఈ వార్డు పరిధిలో తక్కువ ఖర్చుతోనే ప్రజలకు ఎంతో మేలైన సౌకర్యాలను అందించే వెసులుబాటు ఉన్నప్పటికీ వాటి అమలులో ఎనలేని జాప్యం జరుగుతోంది.

వార్డు జనాభా: 1742
ఓటర్లు: 1245
వీధులు: కనకదుర్గమ్మ వేపచెట్టు, గుడివీధి, కల్వకొలనువీధి, బంటుమిల్లివారి వీధి, బ్రహ్మానందం వీధి



కల్వకొలను వీధిలో మురుగునీటి డ్రెయిన్‌లో రక్షిత మంచినీరు పట్టుకుంటున్న మహిళ

3వ వార్డులో చుట్టూ.. సమస్యలే..

అమలాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):



బంటుమిల్లి జమిందారువీధిలో తాగునీటిలో మురుగునీటి కలయికను గుర్తించేందుకు తీసిన గోతులు

డ్రైన్లు దారుణం..

డ్రైన్స్ మరీ అధ్వానంగా ఉన్నాయి. ఎన్టీఆర్ మార్గ్ రోడ్డు నుంచి బ్రహ్మానందం వీధి మీదుగా కల్వకొలను వీధికి వెళ్లే రోడ్డు మట్టం పెరిగిపోవడం వల్ల లోతట్టు ప్రాంతంగా మారి వర్షాకాలంలో డ్రెయిన్‌లో వర్షపునీరు నిలిచిపోయి సమీప ప్రాంతాల్లోని ఇళ్లను చుట్టుముడుతోంది. ఈ సమయంలో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్ల కారణంగా ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దృష్టి సారిస్తే చాలా తక్కువ ఖర్చుతో పరిష్కారమయ్యే సమస్య ఇది కానీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ వార్డులో డ్రైన్లు చాలాచోట్ల కుంగిపోయాయి. కొన్ని అయితే అసలు నామరూపాలు లేకుండా పోయాయి. వాటికి మరమ్మతులు చేపట్టి మురుగునీరు పారే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.



బ్రహ్మానందం వీధిలో అధ్వాన్నంగా ఉన్న సీసీ రోడ్డు

రోడ్లు అధ్వానం

ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో అత్యాధునిక భవనాలు, భారీగా అపార్టుమెంట్లు నిర్మితమయ్యాయి. వివిధ పార్టీలకు చెందిన కీలకమైన నాయకులు ఈ ప్రాంతంలో నివశిస్తున్నారు. సిమెంట్ రోడ్లు ఏర్పాటైనప్పటికీ కొన్ని దశాబ్దాల క్రితం వేయడంతో సీసీ రోడ్లు ఇప్పుడు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దీంతో వాటిని పునర్నిర్మించాల్సిన పరిస్థితి పురపాలక సంఘంపై పడింది. దీనిలో భాగంగా ఎన్టీఆర్ మార్గ్ రోడ్డు నుంచి బ్రహ్మానందం వీధి మీదుగా కల్వకొలను వీధికి వెళ్లే రోడ్డును ఆధునికీకరించాల్సిందేనని ఆ వార్డు ప్రజలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.



కల్వకొలను వీధిలో మురుగునీటి డ్రెయిన్‌లో తాగునీటి పైపు

నీటి సమస్య

ఈ వార్డులో మరో ప్రధాన సమస్య తాగునీరు.. మురుగునీటి డ్రైన్ల చెంతనే కుళాయిలు ఉండడం వల్ల ఎక్కడ ఏ సమస్యల ఉత్పన్నమవుతుందో తెలియడం లేదు. కొన్ని కుళాయిల్లోకి తరచూ మురికినీరు చేరుతోంది. ఇది ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర సమస్యగా పరిణమించింది. అక్కడికీ మున్సిపల్ అధికారులు సమస్యలు ఎక్కడ ఉత్పనమవుతున్నాయో అన్వేషించే కార్యక్రమంలో భాగంగా చాలాచోట్ల రోడ్లు తవ్వి పైపులైన్లను పరిశీలించినప్పటికీ ఆ సమస్యకు కారణాలు గుర్తించలేకపోతున్నారు. దీంతో మురికినీరే పట్టుకుంటున్నామని, కుళాయిలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసి తాగునీరు అందించే విధంగా చూడాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.



కల్వకొలను వీధిలో ధ్వంసమైన సీసీ డ్రెయిన్

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నా. ఇప్పటికే పలు సమస్యలను గుర్తించా. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నా. ప్రధానంగా తాగునీటి సమస్య ఉంది. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. సీసీ డ్రెయిన్ నిర్మాణంతో పాటు బ్రహ్మానందం వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

యేడిద శ్రీను, వార్డు కౌన్సిలర్

పట్టణం విస్తరిస్తున్నా..
సౌకర్యాల కల్పన సున్నా..
రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్యలతో సతమతం
3వ వార్డు ప్రజల ఇబ్బందులు

వార్డు ప్రజల మనోగతం

కల్వకొలనువీధిలో
డ్రైనేజీ అధ్వానం



కల్వకొలను వీధిలో డ్రైనేజీ అధ్వానంగా ఉంది. సీసీ డ్రెయిన్ కట్టడం పూర్తిగా ధ్వంసం కావడంతో ఒక్కోసారి మురుగునీరు రోడ్డెక్కుతుంది. మురుగునీరు ముందుకు పారే దారిలేక దోమల బెడద విపరీతంగా పెరిగింది. సమస్యను కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లాం. పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పిండి సత్యవతి, కల్వకొలను వీధి

కలుషితమైన
తాగునీరు సరఫరా



ఏనాడో వేసిన పైపులైన్లు కావడంతో ఒక్కోసారి రక్షిత మంచినీటికి బదులు మురికినీరు సరఫరా అవుతోంది. మురుగునీటి డ్రైన్లను ఆనుకుని తాగునీటి పైపులైన్లు వేయడం వల్ల వార్డుల్లోని పలు వీధుల్లో తరచూ కలుషితనీరు సరఫరా అవుతోంది. వార్డులో సక్రమంగా తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. బ్రహ్మానందం వీధిలో ఎప్పుడో వేసిన సీసీ రోడ్డు పాడైపోయింది. పలు చోట్ల గోతులు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

రేమెళ్ల శ్రీనివాస్, బ్రహ్మానందంవీధి

తాగునీటి సమస్యను
పరిష్కరించాలి



వార్డులో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి. తాగునీరు సక్రమంగా అందక వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్లు పలుచోట్ల అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు ముందుకు పారే దారిలేక దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజలు రోగాల బారిన పడక ముందే డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలి. దోమల బెడదతో రాత్రివేళల్లో కంటిమీద కునుకు లేకుండా ఉంది. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది..

గొర్తి చిన్నా, మోబర్లీపేట

రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

మలికిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరం మంగెన రాధాకృష్ణ కల్యాణ మండపం ఎంజీ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే దేవ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, పట్టభద్రుల ఉమ్మడి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శాసనమండలి పాలనాపరంగా ప్రాధాన్యతతో కూడుకున్నదన్నారు. సెంట్రల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీలు కేతా శ్రీనివాస్, ఎంపీ సత్యవాణి, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెద్దకాపు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, చెల్లింగి సత్యనారాయణ పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలి

పి.గన్నవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటుతో పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించి కూటమి ఐక్యతను చాటాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపు నిచ్చారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో జరిగిన కూటమి నాయకుల సమావేశానికి ఎమ్మెల్యే అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ అసెంబ్లీలో మెజార్టీ ఉంటే సరిపోదని శాసనమండలిలో కూడా పట్టు సాధించాలన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 3,15, 261మంది ఓటర్లు ఉన్నారని, జిల్లాలో 69,151మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు.

గణతంత్ర దినోత్సవ స్ఫూర్తిగా చిత్రాలు



మలికిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మలికిపురానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు నల్లి సంగీతరావు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చక్కటి చిత్రాన్ని గీశారు. జాతిపతి మహాత్మాగాంధీ సంపూర్ణ స్వరాజ్యంతో సంతోషంగా నవ్వుతూ ఉన్నట్టు, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, మొదటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్ రూపాలను, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, బాలుడు శాంతికపోతాన్ని ఎగురవేస్తున్నట్టు కళ్లకు కట్టినట్టు చిత్రీకరించారు.

56ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం



పి.గన్నవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మానేపల్లిజడ్పీ హైస్కూల్లో 56ఏళ్ల క్రితం చదువుకున్న 1968-69, 1969-70 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం హైస్కూల్‌లో కలుసుకున్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

అమలాపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ జట్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి-బాబ్జి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, మంద గద్దయ్య తదితరులు పాల్గొన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, మట్టపర్తి నాగేంద్ర, కొల్లాటి దుర్గాబాయి, కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం వద్ద జిల్లాశాఖ అధ్యక్షుడు డాక్టర్ గోదశి గంగరాజు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో గణతంత్ర వేడుకల్లో భాగంగా అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి పీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నందిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో కమిషనర్ పి.రవివర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ భాస్కరరావు, ఏఈ టీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు తాడి నరసింహరావు, దాట్ల బాబు, విళ్ల వీరాస్వామినాయుడు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని తాడి శ్రీవెంకటాచార్య ఆవిష్కరించారు. సర్కిల్ పోలీసు కార్యాలయం వద్ద సీఐ ఎం.మోహన్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుస్టేషన్ వద్ద స్టేషన్ హౌస్ ఆఫీస్ జీబీ స్వామి పతాకాన్ని ఆవిష్కరించారు.



అమలాపురంలో టీడీపీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను వాడవాడలా శనివారం ఘనంగా జరుపుకున్నారు. మామిడికుదురు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కార్యాలయంలో ఆచార్యులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మామిడికుదరు హైస్కూలులో ప్రధానోపాధ్యాయిని, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. మామిడికుదురు హైస్కూల్లో క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పతకాలను బహూకరించారు. మామిడికుదురులోని కేతన్ యోగా కేంద్రంలో కేతన్ ఆకుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మామిడికుదురు మెయిన్ ఎలిమెంటరీ స్కూలులో జరిగిన వేడుకల్లో పూలే సామాజిక చైతన్యవేదిక అధ్యక్షుడు నయినాల కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మహానుభావుల త్యాగాల ప్రతిఫలమే గణతంత్ర దినోత్సవమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం హైస్కూల్లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.శ్రీపల్లవి, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బి.శివకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

యానాం,(ఆంధ్రజ్యోతి): యానాంలో ఆదివారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిపాలనాధికారి మునిస్వామి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పరిపాలపాధికారి మునిస్వామి, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎస్పీ రాజశేఖరన్‌లు తివర్ణ రంగుల బెలూన్స్, శాంతికపోతాలను ఎగురవేశారు. యానాం పోలీసుశాఖ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు, ఐఆర్‌బీ, హోంగార్డులు, విద్యార్థులు కవాతు నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శలు అలరించాయి.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి





గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న దుర్గారావు, పాతచిత్రం

ముమ్మిడివరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం వీఆర్ఏగా పనిచేస్తున్న దివి కనకదుర్గారావు(55) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో తహశీల్దార్ కార్యాలయంలో జెండా వందనంలో పాల్గొని ఇంటికి తిరిగి వెళ్లిన దుర్గారావు గుండెపోటుకు లోనై మృతిచెందాడు. దుర్గారావుకు భార్య కనకదుర్గ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుండెపోటుతో ఫీల్డుఅసిస్టెంట్ రామకృష్ణ మృతి





బెండమూర్లంకలో ఆదివారం ఉపాధి కూలీలతో ఫీల్డుఅసిస్టెంట్ రామకృష్ణ, (పాతచిత్రం)

అల్లవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బెండమూర్లంక పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలతో పనులు చేయిస్తున్న ఫీల్డు అసిస్టెంట్ పెనుమాల రామకృష్ణ (52) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఉపాధి కూలీలతో కొబ్బరి చెట్ల పళ్లాలు కొట్టిస్తుండగా గుండెపోటు వచ్చి కుప్పకూలగా అల్లవరం సామాజిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అతడు చనిపోయినట్టు నిర్ధారించారు. అతడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అంతర్వేది ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

అంతర్వేది, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఎలక్ట్రికల్, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వామివారి ఉత్సవాల పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వామివారి కల్యాణాన్ని ప్రతీ ఒక్కరు తిలకించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి స్వామివారి ఆలయ ప్రాంగణం నుంచి సోదరి గుర్రాలక్కమ్మ, ఆలయ పురవీధులు, స్నానఘట్ట ప్రదేశాలు, తెప్పోత్సవం జరిగే ప్రాంతాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. రహదారులు, కల్యాణ మహోత్సవాల ప్రాంతాలు విద్యుత్‌కాంతులతో అలంకరించాలన్నారు.

మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి

అంతర్వేది, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి ఏర్పడుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో జరిగిన సదస్సులో మాట్లాడారు. 23రకాల ఫిషర్‌మెన్ బెనిఫిట్స్ అందుబాటులోకి వచ్చాయని, రాయితీలో పథకాలు పొందవచ్చాన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం

అంతర్వేది, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం బహుళ ద్వాదశి సందర్భంగా స్వామివారి శాంతికల్యాణం వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు స్వామి-అమ్మవార్లను ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యహావచనం, పాణిగ్రహణం, మాంగళ్యధారణ, కల్యాణ తంతును అర్చకులు జరిపించారు. భక్తుల గోవిందనామ స్మరణలతో శాంతి కల్యాణం జరిగింది.

నిండు శోకంతో మూసేహేఖాశిం షహదత్

మామిడికుదురు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ముస్లిం మతస్తుల ఏడో ప్రవక్త మూసేహేఖాశిం షహదత్‌ను ముస్లిం భక్తులు నగరంలో నిండు శోకంతో జరుపుకున్నారు. మంజిలేకర్బలాలోని షహదత్‌ను పురస్కరించుకుని మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు మజ్లిస్ ఆలపించారు. మొల్లా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి మాతం నిర్వహిస్తూ ఊరేగింపు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హిమామ్‌కు నివాళులర్పించారు.

సీఐకు ఉత్తమ సేవా పురస్కారం

ముమ్మిడివరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందించినందుకు ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కార అవార్డు లభించింది. అమలాపురంలో జరిగిన గణతంత్ర వేడుకలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు నుంచి సీఐ మోహన్‌కుమార్ ఆదివారం అవార్డును అందుకున్నారు.

మండపేట

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

అమలాపురం పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో అపార్టుమెంట్లు, భారీ భవంతులు నిర్మాణాలు ఓ పక్క.. సమస్యలతో సతమతమవుతున్న ప్రాంతాలు మరో పక్క..పట్టణం విస్తరిస్తున్నట్టే పట్టణంలో పలు ప్రాంతాల్లో సమస్యలు కూడా విస్తరిస్తున్నాయి. మంచినీటి సదుపాయం, ప్రధానమైన రోడ్లు, విద్యుద్దీపాలు,డ్రైన్ల నిర్మాణం వంటివి కూడా ఏళ్ల తరబడి జరగకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇలాంటి సమస్యలకు కేంద్ర బిందువుగా అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 3వ వార్డు ఉంది. గత కొన్నేళ్ల నుంచి ఇక్కడ సమస్యలు తిష్ట వేశాయి. ఈ వార్డు పరిధిలో తక్కువ ఖర్చుతోనే ప్రజలకు ఎంతో మేలైన సౌకర్యాలను అందించే వెసులుబాటు ఉన్నప్పటికీ వాటి అమలులో ఎనలేని జాప్యం జరుగుతోంది.

వార్డు జనాభా: 1742
ఓటర్లు: 1245
వీధులు: కనకదుర్గమ్మ వేపచెట్టు, గుడివీధి, కల్వకొలను వీధి, బంటుమిల్లివారి వీధి, బ్రహ్మానందం వీధి

3వ వార్డులో చుట్టూ.. సమస్యలే..


కల్వకొలను వీధిలో మురుగునీటి డ్రెయిన్‌లో రక్షిత మంచినీరు పట్టుకుంటున్న మహిళ


బంటుమిల్లి జమిందారువీధిలో తాగునీటిలో మురుగునీటి కలయికను గుర్తించేందుకు తీసిన గోతులు

డ్రైన్లు దారుణం..

డ్రైన్స్ మరీ అధ్వానంగా ఉన్నాయి. ఎన్టీఆర్ మార్గ్ రోడ్డు నుంచి బ్రహ్మానందం వీధి మీదుగా కల్వకొలను వీధికి వెళ్లే రోడ్డు మట్టం పెరిగిపోవడం వల్ల లోతట్టు ప్రాంతంగా మారి వర్షాకాలంలో డ్రెయిన్‌లో వర్షపునీరు నిలిచిపోయి సమీప ప్రాంతాల్లోని ఇళ్లను చుట్టుముడుతోంది.. ఈ సమయంలో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్ల కారణంగా ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దృష్టి సారిస్తే చాలా తక్కువ ఖర్చుతో పరిష్కారమయ్యే సమస్య ఇది కానీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఈ వార్డులో డ్రైన్లు చాలాచోట్ల కుంగిపోయాయి. కొన్ని అయితే అసలు నామరూపాలు లేకుండా పోయాయి. వాటికి మరమ్మతులు చేపట్టి మురుగునీరు పారే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

అమలాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):


కల్వకొలను వీధిలో ధ్వంసమైన సీసీ డ్రెయిన్

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నా. ఇప్పటికే పలు సమస్యలను గుర్తించా. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నా. ప్రధానంగా తాగునీటి సమస్య ఉంది. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. సీసీ డ్రెయిన్ నిర్మాణంతో పాటు బ్రహ్మానందం వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. యేడిద శ్రీను, వార్డు కౌన్సిలర్

పట్టణం విస్తరిస్తున్నా..
సౌకర్యాల కల్పన సున్నా..
రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్యలతో సతమతం
3వ వార్డు ప్రజల ఇబ్బందులు


బ్రహ్మానందం వీధిలో అధ్వాన్నంగా ఉన్న సీసీ రోడ్డు

రోడ్లు అధ్వానం

ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో అత్యాధునిక భవనాలు, భారీగా అపార్టుమెంట్లు నిర్మితమయ్యాయి. వివిధ పార్టీలకు చెందిన కీలకమైన నాయకులు ఈ ప్రాంతంలో నివశిస్తున్నారు. సిమెంట్ రోడ్లు ఏర్పాటైనప్పటికీ కొన్ని దశాబ్దాల క్రితం వేయడంతో సీసీ రోడ్లు ఇప్పుడు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దీంతో వాటిని పునర్నిర్మించాల్సిన పరిస్థితి పురపాలక సంఘంపై పడింది. దీనిలో భాగంగా ఎన్టీఆర్ మార్గ్ రోడ్డు నుంచి బ్రహ్మానందం వీధి మీదుగా కల్వకొలను వీధికి వెళ్లే రోడ్డును ఆధునికీకరించాల్సిందేనని ఆ వార్డు ప్రజలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.


కల్వకొలను వీధిలో మురుగునీటి డ్రెయిన్‌లో తాగునీటి పైపు

నీటి సమస్య

ఈ వార్డులో మరో ప్రధాన సమస్య తాగునీరు.. మురుగునీటి డ్రైన్ల చెంతనే కుళాయిలు ఉండడం వల్ల ఎక్కడ ఏ సమస్యల ఉత్పన్నమవుతుందో తెలియడం లేదు. కొన్ని కుళాయిల్లోకి తరచూ మురికినీరు చేరుతోంది. ఇది ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర సమస్యగా పరిణమించింది. అక్కడికీ మున్సిపల్ అధికారులు సమస్యలు ఎక్కడ ఉత్పనమవుతున్నాయో అన్వేషించే కార్యక్రమంలో భాగంగా చాలాచోట్ల రోడ్లు తవ్వి పైపులైన్లను పరిశీలించినప్పటికీ ఆ సమస్యకు కారణాలు గుర్తించలేకపోతున్నారు. దీంతో మురికినీరే పట్టుకుంటున్నామని, కుళాయిలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసి తాగునీరు అందించే విధంగా చూడాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

వార్డు ప్రజల మనోగతం

కల్వకొలనువీధిలో డ్రైనేజీ అధ్వానం



కల్వకొలను వీధిలో డ్రైనేజీ అధ్వానంగా ఉంది. సీసీ డ్రెయిన్ కట్టడం పూర్తిగా ధ్వంసం కావడంతో ఒక్కోసారి మురుగునీరు రోడ్డెక్కుతుంది. మురుగునీరు ముందుకు పారే దారిలేక దోమల బెడద విపరీతంగా పెరిగింది. సమస్యను కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లాం. పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పిండి సత్యవతి, కల్వకొలను వీధి

కలుషితమైన తాగునీరు సరఫరా



ఏనాడో వేసిన పైపులైన్లు కావడంతో ఒక్కోసారి రక్షిత మంచినీటికి బదులు మురికినీరు సరఫరా అవుతోంది. మురుగునీటి డ్రైన్లను ఆనుకుని తాగునీటి పైపులైన్లు వేయడం వల్ల వార్డుల్లోని పలు వీధుల్లో తరచూ కలుషితనీరు సరఫరా అవుతోంది. వార్డులో సక్రమంగా తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. బ్రహ్మానందం వీధిలో ఎప్పుడో వేసిన సీసీ రోడ్డు పాడైపోయింది. పలుచోట్ల గోతులు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

రేమెళ్ల శ్రీనివాస్, బ్రహ్మానందంవీధి

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



వార్డులో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి. తాగునీరు సక్రమంగా అందక వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్లు పలుచోట్ల అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు ముందుకు పారే దారిలేక దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజలు రోగాల బారిన పడక ముందే డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలి. దోమల బెడదతో రాత్రివేళల్లో కంటిమీద కునుకు లేకుండా ఉంది. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది..

గొర్తి చిన్నా, మోబర్లీపేట

హీరో బాలయ్యకు అవార్డు రావడంపై హర్షం

రామచంద్రపురం(ద్రాక్షారామ) జనవరి 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం ఇవ్వడం సముచితమని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పురస్కారానికి ఎంపికైన ఆయనకు మంత్రి అభినందనలు తెలిపారు.

కేక్ కట్ చేసిన టీడీపీ శ్రేణులు

కె.గంగవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సినీనటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించడంపై తెలుగుదేశం పార్టీ హర్షం ప్రకటించింది. పామర్రులో ఆదివారం మండల స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం హాజరై పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. కాగా ఈ ఇల్లు నందమూరి బాలకృష్ణ భార్య వసుంధర తండ్రి ఇల్లు కావడం విశేషం.

వాడపల్లి ఆలయానికి భక్తుల రద్దీ

ఆత్రేయపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.5,07,236 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

అప్పారావుకు పద్మశ్రీ అవార్డు రావడం జిల్లాకు గర్వకారణం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రావులపాలానికి చెందిన మిరియాల అప్పారావుకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం జిల్లాకే గర్వకారణమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో అప్పారావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన అప్పారావును ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. అవార్డు తీసుకోవాడానికి కొద్దిరోజుల ముందే ఆయన మరణించడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

• వాడవాడలా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం • అధికారులు, ప్రజాప్రతినిధుల హాజరు


మండపేటలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంతో పాటు మండలంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో దేవరకొండ అఖిల జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు వద్ద జిల్లా జడ్జి ఎం.హరినారాయణ జాతీయ జెండా ఆవిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళి, వాడ్రేవు సాయిప్రసాద్, కార్యవర్గం, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ బి.రఘువీర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సీఐ కార్యాలయం వద్ద సీఐ ఎం.వెంకట నారాయణ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం.సావిత్రి జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో కడలి పద్మజ్యోతి జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ శాకా బాబి, ఈవీఆర్డీ షెలట్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు. రామచంద్రపురం పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, కళాశాలలు గ్రామ, వార్డు సచివాలయాల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం: రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా జడ్జి ఎం.హరినారాయణ దీన్ని ప్రారంభించారు. బొల్లినేని ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వైద్యసేవలు పొందారు.

విద్యార్థుల ప్రదర్శన: రామచంద్రపురం విజ్ఞాన భారతి పాఠశాలకు చెందిన 100 మంది ఘోష్ పథసంచాలన్ నిర్వహించారు. పాఠశాల నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు తిరిగి డీఎస్పీ కార్యాలయం నుంచి విజ్ఞాన భారతి పాఠశాల వరకు ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బీవీకె కార్యదర్శి వి.రామసత్యనారాయణ, డాక్టర్ కె.నాగసతీష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా జరిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎ.రాజు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావుతో పాటు పలువురు ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక కోర్టు ఆవరణ, రెవెన్యూ కార్యాలయం, సబ్‌ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండా రెపరెపలాడింది. మండలంలోని పలు పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా జరిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకటరామన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీపీ కె.అన్నపూర్ణ దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దారు రాజేశ్వరరావు, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఎస్.రాము, పలు శాఖల కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామ సచివాలయాలు, పాఠశాలల వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలను ఆదివారం వాడవాడలా నిర్వహించారు. కె.గంగవరంలో తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ వద్ద తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎస్‌కె జానీబాషా, మండల వనరుల కేంద్రంలో ఎంఈవో ఏ.నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేట అర్బన్, రూరల్‌లో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా జరిపారు. మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.నూకదుర్గారాణి, కమిషనర్ టీవీ రంగారావు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఉండమట్ల వాసు, మండల పరిపాలనాధికారి ప్రసాద్, మండల విద్యాధికారి ఎస్.రామచంద్రరావు, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ తేజేశ్వరరావు, పట్టణ పోలీసుస్టేషన్ వద్ద సీఐ సురేష్, ఆదిత్య కాలేజీ వద్ద డైరెక్టర్ సుబ్బిరెడ్డితోపాటు పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఎగుర వేశారు.

మండపేట రూరల్‌లో: ద్వారపూడిలో పంచాయతీ కార్యదర్శి ఆకుల వీవీ రమణ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అర్తమూరు, తాపేశ్వరం, ఇప్పనపాడు, ఏడిద, కేశవరం, పాలతోడు, వెలగతోడు, వై.సీతానగరం, మారేడుబాక తదితర పంచాయతీల వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో: ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆదివారం మండపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాయవరం తహశీల్దారు కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో తహశీల్దారు ఐవీ శెట్టి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ సురేష్‌బాబు జాతీయ జెండాను ఎగరవేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బ్యాంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా జరిపారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో రత్నకుమారి, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ చిన్నారావు, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీవో ఎ.గజలక్ష్మి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా కార్యదర్శులు, పాఠశాలల వద్ద ఎంఈవో తాతారావు, పాఠశాలల హెచ్‌ఎం లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ సాకా శ్రీనివాస్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు భోజనం ప్లేట్లు, సౌండ్ సిస్టం అందజేత: జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ అల్లుడు, కుమార్తె వీరేంద్ర, లక్ష్మీసౌజన్య జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాలకు భోజనం ప్లేట్లు అందించారు. 2002-07 బ్యాచ్‌కు చెందిన పాఠశాల విద్యార్థులు సౌండ్ సిస్టం బహూకరించారు. ఇటీవల జరిగిన క్రీడా ఉత్సవాల విజేతలకు బహుమతులు అందజేశారు. నేలటూరులో పూర్వ విద్యార్థులు అప్పటి యూపీ స్కూల్ హెచ్‌ఎం పిడపర్తి భీమశంకరశాస్త్రి జ్ఞాపకార్థం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, శ్రామిక నగర్ పాఠశాలనందు విశ్రాంత సైనిక ఉద్యోగి పిడపర్తి కృష్ణప్రసాద్, కుడకా మల్లిఖార్జునరావు, రుద్రాక్షల మల్లిఖార్జునరావు సంయుక్తంగా విద్యార్థులకు పెద్దబాలశిక్ష, పెన్సిల్ కిట్లు, పంపిణీ చేశారు. విశ్రాంత సైనిక ఉద్యోగి పిడపర్తి కృష్ణప్రసాద్‌ను పాఠశాల హెచ్‌ఎం పార్వతి, ఉపాధ్యాయ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమాల్లో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలను ఘనంగా జరిపారు. వాడపాలెం పంచాయతీ వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలుత గాంధీ, నేతాజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. కొత్తపేట ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో పి.శ్రీకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


కొత్తపేటలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జాతీయ జెండాను ఎగురవేశారు. రావులపాలెం మార్కెట్ యార్డు, తహశీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల వద్ద, పోలీస్‌స్టేషన్, పాఠశాలలలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు.